నిబంధనాలు

కొత్త రేషన్ కార్డులకు ఇబ్బందులు

పలు సచివాలయాల్లో పనిచేయని కంప్యూటర్లు

మరో పక్క సర్వర్ డౌన్

సచివాలయాల చుట్టూ దరఖాస్తుదారుల ప్రదక్షిణలు

కొత్త రేషన్ కార్డు కోసం దరఖాస్తు దారులకు కష్టాలు తప్పడం లేదు. ఓ పక్క నిబంధనలు గుదిబండగా మారగా.. మరో వైపు సర్వర్ సమస్యతో చుక్కలు కనిపిస్తున్నాయి. కొత్త రేషన్ కార్డుల కోసం.. మార్పులు, చేర్పుల కోసం పనులు మానుకొని సచివాలయానికి పరుగులు తీస్తున్నా ప్రయోజనం ఉండడం లేదని దరఖాస్తులు దారులు వాపోతున్నారు. ప్రభుత్వం పెట్టిన నిబంధనలతో ప్రదక్షిణ చేయాల్సి వస్తోం దని ఆవేదన చెందుతున్నారు.



దల్లివానిపాలెం సచివాలయం


ఒక కంప్యూటర్ పూర్తిగా డెడ్.. మరొకటి సర్వర్ మొరాయింపు


సచివాలయంలో నిద్రిస్తున్న కుక్క

పెదగంట్యాడ: కొత్త రేషన్ కార్డులు, మార్పుల, చేర్పులకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. దీంతో అర్హులైన వారిలో నెలకొన్న ఆనందం కాస్తా ఆన్‌లైన్ కష్టాలతో ఆవిరైపోతోంది. ఈ నెల 7 నుంచి కొత్త రేషన్ కార్డులు, పిల్లల యాడింగ్, మార్పులు, చేర్పులు చేసుకోవడానికి ప్రభుత్వం అవకాశం కల్పించిందని సచివాలయానికి వెళ్తే అక్కడ కంప్యూటర్లు పని చేయకపోవడంతో వారిలో నిరాశ నిస్పృహలు అలుముకుంటున్నాయి.

గుది బండగా నిబంధనలు

ప్రభుత్వం పెట్టిన నిబంధనలతో ప్రజలు సచివాలయాల చుట్టూ ప్రదక్షిణ చేస్తున్నారు. కుటుంబసభ్యులందరి మ్యాపింగ్ ఒకే చోట లేకపోతే వారి దరఖాస్తులు ఆన్‌లైన్ కావడంలేదు. కార్డులో పిల్లల పేర్లు యాడింగ్ విషయంలో అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. మరో వైపు బయోమెట్రిక్ పడకపోతే దరఖాస్తు ఆన్‌లైన్ అవడం లేదు. ఈ నేపథ్యంలో దరఖాస్తుదారులకు చుక్కలు కనిపిస్తున్నాయి.కొత్తగా రేషన్ కార్డు కోసం కుటుంబ సభ్యుల ఫొటో, ఆధార్ కార్డులు ఉండాలని సూచించారు. ఆపై పిల్లల యాడింగ్ కోసం ఆధార్ కార్డులు అప్‌డేట్ చేసుకోవాలని సూచిస్తున్నారు. దీంతో రేషన్ కార్డులు లేనివారంతా మ్యాపింగ్, ఆధార్ కార్డుల అప్‌డేట్ కోసం పరుగులు తీస్తున్నారు. అయితే సచివాయాలతో సర్వర్ పని చేయకపోవడంతో పాటు కంప్యూటర్లు కూడా మొరాయించడంతో గంటల తరబడి నిరీక్షించాల్సి వస్తోంది. మరో స్టేషనరీని కూడా సరఫరా చేయకపోవడంతో దానికి సిబ్బంది డబ్బులు పోగు చేసుకొని కొనుగోలు చేయాల్సిన దుస్థితి నెలకొని ఉంది.

బయోమెట్రిక్ పడితేనే..

రేషన్‌కార్డుల కోసం వచ్చిన దరఖాస్తులను ఆన్‌లైన్ చేసే ప్రక్రియలో ప్రధాన దరఖాస్తుదారుడు తప్పనిసరిగా తన బయోమెట్రిక్ (వేలిముద్ర) వేయాల్సి ఉంటుంది. ఏ కారణంతో నైనా బయోమెట్రిక్ పడకుంటే దరఖాస్తు ఆన్‌లైన్ కావడం లేదు. గతంలో ఆధార్‌కు లింక్ అయిన మొబైల్‌కు ఓటీపీ వచ్చేది. దీని వల్ల బయోమెట్రిక్ పడని వారికి ఉపయోగకరంగా ఉండేది. ప్రస్తుతం ఈ ఆప్షన్‌ను తొలగించారని సిబ్బంది చెబుతున్నారు.

మ్యాపింగ్ కష్టాలు

రేషన్‌కార్డుకు వివాహమై పిల్లలు ఉన్న వారు దరఖాస్తు చేసుకోవాలంటే కుటుంబంలో అందరూ ఒకేచోట ఉన్నట్టు హౌస్ మ్యాపింగ్ ఉండాలి. తల్లిదండ్రులు వారి పిల్లలు ఒకే కుటుంబం అయినప్పటికీ మ్యాపింగ్‌లో ఒకేచోట లేకపోతే దరఖాస్తు స్వీకరణ సమయంలో ఆన్‌లైన్ కావడం లేదు. ఈ సమస్య పరిష్కరించకపోతే కొత్త రేషన్ కార్డు పొందే అవకాశాన్ని కోల్పోతారు.

ఫీల్డ్‌లో సిబ్బంది...

సచివాలయంలో వీఆర్‌వో, వెల్ఫేర్, డేటా ఎంట్రీ తదితర సిబ్బంది అందుబాటులో ఉండటం లేదని, దీంతో మిగిలి ఉన్న సిబ్బంది ఇది మాపని కాదని చెబుతున్నారు. సంబంధిత సిబ్బందికి ఫోన్ చేయాలని నంబర్లు ఇస్తున్నారు. తీరా ఫోన్ చేస్తే వారు తహసీల్దార్ కార్యాలయంలో ఉన్నాం... బయట ఫీల్డ్‌లో ఉన్నాం అని చెబుతూ అక్కడి రండి, ఇక్కడకి రండీ అంటూ దరఖాస్తుదారులను ఇబ్బంది పెడుతున్నారు. పర్యవేక్షించాల్సిన అధికారులు పట్టించుకోపోవడంపై ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.


సర్వర్ పనిచేయకపోవడంతో చిన్న పిల్లలతో నిరీక్షిస్తున్న దరఖాస్తుదారులు

సర్వర్ సమస్య పరిష్కరించాలి



నాకు మా అమ్మ నాన్నలతో కలసి రేషన్ కార్డు ఉంది.. వివాహం జరిగి పాప ఉంది. వాళ్లని రేషన్ రేషన్ కార్డులో యాడింగ్ కోసం పనులు మానుకుని సచివాలయానికి వెళ్లే వాళ్లం . సర్వర్ పనిచేయడం లేదని, కంప్యూటర్ పని చేయలేదని సిబ్బంది చెప్పేవారు. ఎట్టకేలకు వారం రోజులు తిరిగితే అప్‌లై చేశారు.ప్రభుత్వం స్పందించి ఇలాంటి సమస్యలను పరిష్కరించే విధంగా చర్యలు చేపట్టాలి.

– పి సంతోష్, పెదగంట్యాడ

క్లుప్తంగా

క్యాంపస్ ఇంటర్వ్యూల్లో 33 మంది ఎంపిక


ఎంపికైన అభ్యర్థులతో లీ ఫార్మా ప్రతినిధులు

గాజువాక: లీ ఫార్మాలో ఉద్యోగాల భర్తీకి స్థానిక టీఎస్సార్, టీబీకే డిగ్రీ కళాశాలలోఆదివారం నిర్వహించిన జాబ్ మేళాలో 33 మంది అభ్యర్థులు ఎంపికయ్యారు. ఇంటర్వ్యూల్లో 70 మంది అభ్యర్థులు పాల్గొనగా వివిధ దశల అనంతరం 33 మందిని ఎంపిక చేసినట్టు కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.విష్ణువర్ధన్‌రావు తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు ఈ సందర్భంగా ఆయన అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ప్లేస్‌మెంట్ ఆఫీసర్ కె.కుసుమ, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ సుభాషిణి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మాస శివరాత్రి పూజలు


పూజలు అందుకుంటున్న రామలింగేశ్వరుడు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ బీసీ గేటు ఉమారామలింగేశ్వర ఆలయంలో ఆదివారం మాస శివరాత్రి పూజలు ఘనంగా నిర్వహించారు. ఆలయ ఆవరణలోని శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామికి,వల్లీ దేవసేన సమేత సుబ్రమణ్యస్వామి, అభయ ఆంజనేయ స్వామితో పాటు నవగ్రహాలకు అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. దేవతా మూర్తులను అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. వేకువజామున ఉమా రామలింగేశ్వరులకు ప్రత్యేక పూజలు, రుద్రాభిషేకాలు చేశారు. ఆలయ అర్చకులు నాగేశ్వరశర్మ, కమిటీ ప్రతినిధులు ఎల్లేటి శ్రీనివాసరావు, పి. రామచంద్రరావు, గోపి నాయుడు, మహాదేవ్, అప్పలరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉల్లాసం.. ఉత్సాహం


డ్యాన్స్ చేస్తున్న చిన్నారి

గాజువాక: స్థానిక శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరం ఆదివారం ఉల్లాసంగా, ఉత్సాహంగా కొనసాగింది. పలువురు చిన్నారులు సోలో డ్యాన్స్ ప్రదర్శించారు. తమకు నచ్చిన పాటలతో సందడి చేశారు. అంతకుముందు గ్రంథాలయాధికారి బి.చంద్రకళ చిన్నారులతో కథలు చదివించి అందులోని నీతిని వివరించారు. అనంతరం విద్యార్థులకు చేతిరాత పరీక్ష నిర్వహించారు.

వైభవంగా ఉత్సవ విగ్రహం ఊరేగింపు


బంగారుమాంబ ఉత్సవ విగ్రహం

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 69వ వార్డు నాతయ్యపాలెం గ్రామ దేవతలైన బంగారుమాంబ, నూకాంబిక అమ్మవార్ల నవరాత్రి మహోత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. ఆదివారం రాత్రి బంగారుమాంబ ఉత్సవ విగ్రహాన్ని డప్పు వాయిద్యాలు, కోలాటం నడుమ పురవీధుల్లో ఊరేగించారు. మహిళలు అమ్మవారి ప్రతిమను మేసిన భక్తుల కాళ్లు కడిగారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు, గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీతోనే పేదల సంక్షేమం


చీరలు పంపిణీ చేస్తున్న వైఎస్సార్‌సీపీ గాజువాక సమన్వయకర్త దేవన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే చింతలపూడి

కూర్మన్నపాలెం: వైఎస్సార్‌సీపీ పాలనలో పేదలకు సంక్షేమ ఫలాలు అందాయని ఆ పార్టీ గాజువాక సమన్వయకర్త తిప్పల దేవన్‌రెడ్డి పేర్కొన్నారు. ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల అభ్యున్నతికోసమే పథకాలు అమలు చేసి వారికి ఆర్థిక భరోసా కల్పించారన్నారు. 87వ వార్డు గాంధీ బొమ్మ సెంటర్‌లో వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన పేదలకు చీరల పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా దేవన్‌రెడ్డి మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన ప్రతి పథకం వల్ల పేద ప్రజలకు మేలు జరిగిందన్నారు. మాజీ ఎమ్మెల్యే చింతలపూడి వెంకటరామయ్య మాటాడుతూ వైఎస్సార్‌సీపీ పాలనలో ఇంటికే సంక్షేమ ఫలాలు అందాయన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం పేదలను పట్టించుకోకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారన్నారు. 87వ వార్డు నాయకుడు ఇల్లపు రాము అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలోనాయకులు ప్రగడ వేణు, దానప్పలు, బొడ్డగోవింద్, బొండా గోవిందరాజులు, కరణం లక్ష్మి, బుగుడి రామలక్ష్మి, కనకమహాలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

ఆలయాలకు విరాళాల అందజేత


అన్న ప్రసాద వితరణకు విరాళం అందజేస్తున్న దాతలు శిరీష, రామ్


ఆలయ కమిటీ ప్రతినిధులకు విరాళం అందజేస్తున్న భానోజీరావు

అక్కిరెడ్డిపాలెం: షీలానగర్ ఎస్టీబీఎల్‌లోని తిరుమల బాలాజీ దివ్యక్షేత్రంలో ప్రతీ శనివారం జరిగే అన్న ప్రసాద పథకానికి ఆదివారం షీలానగర్‌కు చెందిన చుక్క శిరీష, శ్రీరామ్ రూ.10,000 దివ్య క్షేత్రం ట్రస్ట్ ప్రతినిధులకు అందజేశారు.

● జీవీఎంసీ 68వ వార్డు అక్కిరెడ్డిపాలెంలో నూతనంగా నిర్మిస్తున్న గ్రామ దేవతలు దుర్గమాంబ, కుంచమాంబ ఆలయానికి నాతయ్యపాలెంకు చెందిన నాగులాపల్లి భానోజీరావు ఆదివారం రూ.10,116 విరాళం ఆలయ కమిటీ ప్రతినిధులకు అందజేశారు.

దువ్వాడ రైల్వే స్టేషన్‌లో స్వచ్ఛ భారత్


రైల్వే స్టేషన్‌లో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న ప్రతినిధులు

అగనంపూడి: ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం దువ్వాడ రైల్వే స్టేషన్ ప్లాట్ ఫారం – 4లో స్వచ్ఛ భారత్, పరిశుభ్రతపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. జెడ్ఆర్‌సీసీ సభ్యుడు కుంచుమూర్తి ఈశ్వర్, 88వ వార్డు కార్పొరేటర్ మొల్లి ముత్యాలు జెండా ఊపి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రశాంతి ఎక్స్‌ప్రెస్, తిరమల ఎక్స్‌ప్రెస్ రైళ్ల సమయాల్లో ప్రయాణికులకు పరిశుభ్రత ఆవశ్యకతను వివరించారు. దువ్వాడ యూజర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వి.జాషువా, బి.కామేశ్వరరావు, ఆర్.రవి, లయన్స్ క్లబ్ అధ్యక్షులు మురళీధర్ రెడ్డి, కె.వీ.సుబ్బరాజు, విజ్ఞాన్ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు, స్పందన చేయూత ఫౌండేషన్, మానవ వికాశ వేదిక, మానవతా, సాయి సేవా సమితి నుంచి సుందరమూర్తి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రశాంతి ఎక్స్‌ప్రెస్‌లో ప్రయాణిస్తున్న 250 మందికి మినరల్ వాటర్ బాటిళ్లు పంపిణీ చేశారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


ఆత్మీయ సమావేశంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

పరవాడ: వాడచీపురుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1995–96లో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు వారు చదువుకున్న పాఠశాలను వేదికగా చేసుకుని ఆత్మీయ సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. తమ చిన్ననాటి చిలిపి చేష్టలను నెమరువేసుకున్నారు. ప్రస్తుతం వారు స్థిరపడిన వృత్తులు, కుటుంబ విశేషాలను ఒకరికొకరు పంచుకున్నారు. ఆత్మీయ సమావేశంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు వెల్ఫేర్ గ్రూప్‌గా ఎవరికి ఏ కష్టమొచ్చినా.. సహకరిస్తూ ఆర్థికంగా ఆదుకోవాలని నిర్ణయించారు. పాఠశాల చదువులు వదిలి 30 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా మిఠాయిలు పంచుకున్నారు. మధ్యాహ్నం పూర్వ విద్యార్థులు సహపంక్తి భోజనాలు చేసి, సందడిగా గడిపారు. ఫొటోలు తీసుకుని, జ్ఞాపకాలతో వెనుదిరిగారు.

ఘనంగా భూలోకమాంబ ఆలయ వార్షికోత్సవం



భూలోకమాంబను దర్శించుకుంటున్న తిప్పల దేవన్‌రెడ్డి తదితరులు

పెదగంట్యాడ: జీవీఎంసీ 64వ వార్డు యాతపాలెంలో కొలువైన భూలోకమాంబ అమ్మవారి ఆలయ వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. వేకువజాము నుంచే అమ్మవారికి విశేష పూజలు చేశారు. అమ్మవారిని వైఎస్సార్ సీపీ గాజువాక నియోజకవర్గ సమన్వయకర్త తిప్పల దేవన్‌రెడ్డి, నాయకులు ధర్మాల శ్రీను, పితాని అన్నవరం, సంపంగి అప్పలనాయుడు, సంపంగి ఈశ్వరరావు దర్శించుకున్నారు.

కొనసాగిన ఉక్కు కాంట్రాక్ట్ కార్మికుల సమ్మె

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్ట్ కార్మికుల సమ్మె ఆరో రోజు ఆదివారం కూడా కొనసాగింది. స్టీల్ ప్లాంట్ కాంట్రాక్ట్ కార్మికుల తొలగింపులు ఆపాలని, తొలగించిన వారిని విధుల్లోకి తీసుకోవాలన్న డిమాండ్లతో ఈనెల 20 నుంచి కాంట్రాక్ట్ కార్మిక సంఘాలు నిరవధిక సమ్మెకు దిగాయి. అయితే యాజమాన్యం ప్రత్యామ్నాయ ఏర్పాట్లుల చేయడం వల్ల ఉత్పత్తికి పెద్దగా అంతరాయం కలగడం లేదని సమాచారం. ఇదిలా ఉండగా కార్మిక సంఘాల ప్రతినిధులు కార్మికుల నివాసాలకు వెళ్లి సమ్మెకు సహకరించాలని కోరుతున్నారు.

ఆత్మరక్షణ కోసం కరాటే నేర్చుకోవాలి


కరాటే గ్రేడింగ్ టెస్ట్‌లో పాల్గొన్న చిన్నారులు

గాజువాక: ఆత్మ రక్షణతోపాటు ఆత్మ విశ్వాసం పెంపొందడానికి కరాటే దోహదం చేస్తుందని 71వ వార్డు కార్పొరేటర్ రాజాన రామారావు అన్నారు. టైగర్ పవర్ కరాటే కిక్ బాక్సింగ్ అండ్ బాక్సింగ్ అకాడమీ ఆధ్వర్యంలో కరాటే బెల్ట్ గ్రేడింగ్ టెస్టును ఆదివారం నిర్వహించారు. కిక్‌బాక్సింగ్ అసోసియేషన్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు కరణంరెడ్డి నర్సింగరావు మాట్లాడుతూ కరాటే వంటి క్రీడలవల్ల శరీర దారుఢ్యంతోపాటు మానసికంగా బాగా అభివృద్ధి చెందుతారన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు గంటా నూకరాజు, కోచ్‌లు కరణం సన్నీ, ఆనంద్, వెంకట్ పాల్గొన్నారు.

బీచ్‌లో మెరైన్ ఎస్‌ఐ పర్యటన


పర్యాటకులతో మాట్లాడుతున్న మెరైన్ ఎస్‌ఐ మురళీకృష్ణ

కొమ్మాది: ప్రముఖ పర్యాటక ప్రాంతమైన రుషికొండ బీచ్‌ను ఆదివారం ఉదయం మెరైన్ పోలీసులు సందర్శించారు. జూన్ 21న యోగా దినోత్సవం సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నగరానికి రానున్న నేపథ్యంలో బీచ్ ప్రాంతాల్లో భద్రతా ఏర్పాట్లను పరిశీలించినట్లు మెరైన్ ఎస్సై మురళీకృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సై మురళీకృష్ణ పర్యాటకులు, మత్స్యకారులతో ప్రత్యేకంగా మాట్లాడారు. భద్రత దృష్ట్యా ప్రతిరోజు ఎంతమంది పర్యాటకులు బీచ్‌ను సందర్శిస్తున్నారు, మత్స్యకారుల పూర్తి వివరాలను సేకరించినట్లు ఆయన వెల్లడించారు. దీంతో పాటు, బీచ్ పరిసరాల్లో స్థానికేతరుల వివరాలను కూడా అడిగి తెలుసుకున్నారు. అనుమానితులు ఎవరైనా తీర ప్రాంతాల్లో సంచరించినట్లయితే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ప్రజలను ఆయన కోరారు.

మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన


శిబిరంలో సేవలు అందిస్తున్న వైద్యులు

అగనంపూడి: జీవీఎంసీ 85వ వార్డు అగనంపూడి పునరావాస కాలనీ దానబోయినపాలెం సీతారామాలయంలో ఆదివారం యూజు, దానబోయిపాలెం గ్రామ కమిటీ సంయుక్తంగా నిర్వహించిన వైద్య శిబిరాన్ని 85వ వార్డు నాయకుడు ఇల్లపు ప్రసాద్ ప్రారంభించారు. ప్రముఖ కిడ్నీ వ్యాధి నిపుణుడు, ఒంగోలులోని రిమ్స్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ శ్యామ్ రావ్ అత్తోట మాట్లాడుతూ ఆరోగ్య విషయంలో అశ్రద్ధ వహించవద్దని సూచించారు. యూజ్ సంఘం వ్యవస్థాపకుడు కె.పరంధామయ్య మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ నిర్మాణం కోసం ఇళ్లు, భూములను త్యాగం చేసిన ఉక్కు నిర్వాసితులపై అభిమానంతో ఈ శిబిరాన్ని ఏర్పాటు చేశామన్నారు. ఎయిమ్స్ న్యూరాలజీ విభాగం డాక్టర్లు కొప్పోలు ప్రణతి, వి.సిద్ధార్థ, జి.సంధ్య, సురేష్ పి, సురేష్, బి.లీలాబాయి, వి.ప్రమీల, వి.గోపికృష్ణ, పద్మజ, కె.లలిత తదితరులు సేవలందించారు. ఏడీసీ చైర్మన్ బలిరెడ్డి సత్యనారాయణ, ఇల్లపు ప్రసాద్ తదితరులు శిబిరం ఏర్పాటు చేసిన పరంధామయ్యను సత్కరించారు.

టిడ్కో గృహ సముదాయాల్లో వసతులు కల్పించాలి


టిడ్కో ఇళ్ల వద్ద నినాదాలు చేస్తున్న సీపీఐ నాయకులు

పెదగంట్యాడ: మండలంలోని భానోజీతోట, దయాల్‌నగర్, బర్మా కాలనీలో నిర్మించిన టిడ్కో గృహ సముదాయాల్లో కనీస వసతులు కల్పించాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. బర్మా కాలనీలో టిడ్కో లబ్ధిదారులతో కలసి ఆదివారం ఆందోళన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టిడ్కో గృహాలు నిర్మించి ఏళ్లు గడుస్తున్నా కనీస సదుపాయాలైన తాగునీరు, విద్యుత్, డ్రైనేజీ వ్యవస్థను కల్పించలేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించాలని లేనిపక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆనంద్, అప్పలరాజు, భాస్కరరావు, ఖాన్, వెంకటరావు, బాషా, నాని, ధనలక్ష్మి, వైదేహి, జగదీష్ పాల్గొన్నారు.

ఆటోను ఢీకొట్టిన కారు

ఆరుగురికి గాయాలు, ఆస్పత్రిలో చికిత్స


కారు ఢీకొట్టంతో దెబ్బతిన్న ఆటో

తాటిచెట్లపాలెం: తాటిచెట్లపాలెం జాతీయ రహదారి వద్ద ఆదివారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో పలువురు గాయపడ్డారు. ఫోర్త్ టౌన్ ట్రాఫిక్ పోలీసులు తెలిపిన వివరాలివి.. అగనంపూడికి చెందిన భాస్కర్ తన కుటుంబ సభ్యులతో కలిసి సొంత గ్రామం పలాసలో జరుగుతున్న గ్రామదేవత పండగకు బయలుదేరారు. ద్వారకా బస్ స్టేషన్‌కు చేరుకునేందుకు వీరంతా ఆదివారం అర్ధరాత్రి 1.30 గంట సమయంలో అగనంపూడి నుంచి ఆటోలో వస్తున్నారు. తాటిచెట్లపాలెం సమీపంలోకి వచ్చేసరికి రైల్వే న్యూకాలనీ రోడ్డు నుంచి వస్తున్న ఓ కారు వీరి ఆటోను ఢీకొట్టింది. ఈ ఘటనలో ఆటోలో ప్రయాణిస్తున్న ముగ్గురికి తీవ్ర గాయాలు, మరో ముగ్గురికి స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులు కేర్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నారు. కారు ఢీకొనడంతో ఆటో దెబ్బతింది. ఆటో డ్రైవర్ కె.కాశీరావు చేసిన ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ ఉమామహేశ్వరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సత్యసాయి సంస్థల సేవలు నిరుపమానం

రక్తదాన శిబిరానికి విశేష స్పందన


రక్తదానం చేస్తున్న టౌన్ అడ్మిన్ జీఎం చంద్రశేఖర్

ఉక్కునగరం: సత్యసాయి సంస్థల సేవలు నిరుపమానమని స్టీల్‌ప్లాంట్ టౌన్ అడ్మినిస్ట్రేషన్ జీఎం చంద్రశేఖర్ అన్నారు. ఆదివారం ఉక్కునగరం సత్యసాయి మందిరంలో 38వ సారి రక్తదాన శిబిరం నిర్వహించారు. అమ్మ బ్లడ్ బ్యాంక్, లైఫ్ షేర్ బ్లడ్ బ్యాంక్ సంయుక్తంగా ఏర్పాటు చేసిన శిబిరాన్ని చంద్రశేఖర్ ప్రారంభించి రక్తదానం చేశారు. నిర్వాహకులు మాట్లాడుతూ శిబిరం ద్వారా సేకరించిన 68 యూనిట్లు రక్తంలో అమ్మ బ్లడ్ బ్యాంక్‌కు 36 యూనిట్లు, లైఫ్ షేర్ బ్లడ్ బ్యాంక్‌కు 32 యూనిట్లు అందజేశారు. సత్యసాయి సంస్థల జిల్లా సమన్వయకర్త ఆర్.ఎ. నాయుడు, జేసీఐ ప్రతినిధులు రవికుమార్, సత్యసాయి ప్రతినిధులు ఎస్.కె.ఆర్.కె. రాజు, కె.వి. రమణ, వి. కృష్ణ, కె. ప్రకాశ్ పాల్గొన్నారు.